## మృత్యు ముద్రల మధ్య . . . . .

బతికించే నాథుడే ఉండాలి గాని
శవానికి కూడా కాస్సేపైనా బతకాలనే ఉంటుంది.
బతకటమంటే
మరణంతో యుద్ధం చేయటం లానే ఉంటుంది
నిజానికి
ఇక్కడ పుట్టీపుట్టక ముందునుండే మృత్యుచ్ఛాయ వెన్నాడుతుంటుంది
అంతా అసహజంగానే అనిపిస్తుంటుంది
అనుకున్నట్టుగా అన్నీ జరగవని
అందరికీ తెలుస్తూనే ఉంటుంది
అయినా అల్లుకు పోయిన ఆనందాలు –
మరణించిన నిజాన్ని అబద్ధాలుగా చెరిపేస్తుంటాయి
లేనిలోటు తీరేందుకు జవాబు దొరకనంత వరకూ
మనిషిగా మిగిల్చిన పరిమళం తాజాగా ఉన్నంత వరకూ
వారందరికీ –
రహస్యంగా రహస్యాలన్నీ మూటకట్టుకు పోయినట్టే ఉంటుంది.
వెన్నుపోటు కసుక్కున పొడిచినట్టే ఉంటుంది
జ్ఞాపకాలని కెలుకుతూ కలిసి తిరిగిన చెప్పులు
గడపదాటే వరకే జాలి బురఖాల్లో ఉంటాయి
అవిరళంగా కురిసిన ఆకాశం కూడా
ఎప్పటికైనా తేరుకుంటుంది.
అలిసిపోయిన పెద్దల
ఆవులింతల నిట్టూర్పులు తీరకముందే
ఏ ధూళీ అంటని బాల్యాలు
జాలీల్లో నుండి –
కిటికీ సందుల్లో నుండి –
చూరు కన్నాల్లో నుండి

నేలపై అప్పుడే వచ్చి పడుతున్న
వెలుగు ముక్కల్ని భద్రంగా ఏరుకుంటుంటాయి.